రుయాలో ఓపీ కేంద్రం వెలవెల



11 గంటలకే వెలవెలబోతున్న ఓపీ విభాగం

సాధారణంగా రుయాస్పత్రిలో ముందుగా ఓపీ తీసుకోవాలంటే గంటల తరబడి క్యూలో నిల్చోవాలి. కానీ, తుపాను ప్రభావంతో శనివారం ఈదురు గాలులతో కూడిన వర్షానికి రోగులు లేక ఉదయం 11 గంటలకే ఓపీ కేంద్రం వెలవెలబోయింది. సాధారణంగా 1500 మందికి పైగా నమోదయ్యే ఓపీ.. కేవలం 380 మంది రోగులతో ముగిసింది. దీంతో ఓపీ కేంద్రాలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

నిండిన 'కాళంగి'



కేవీబీపురం మండలంలోని కాళంగి జలాశయం నిండింది. సామర్థ్యం 240 ఎంసీఎఫ్‌టీలు కాగా ప్రస్తుతం 218.50 ఉంది. జలాశయంలోకి 7388 క్యూసెక్కుల నీరు చేరుతోందని డీఈ రత్నారెడ్డి చెప్పారు. శనివారం 18 గేట్లలోని ఎనిమిదింటిని ఆరు అడుగులు ఎత్తి 6550 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఏఈ బాబు తెలిపారు.

- కేవీబీపురం, ఆంధ్రజ్యోతి

మల్లిమడుగు నుంచి నీటి విడుదల



రేణిగుంట మండలంలోని మల్లిమడుగు డ్యాం ఇప్పటికే పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. ఈ పరిస్థితుల్లో ఇన్‌ఫ్లో పెరగడంతో రెండు గేట్లను ఎత్తి నీటిని వదిలారు. రాత్రి నీటి మట్టం మరింత పెరిగితే ప్రస్తుతం ఎత్తిన గేట్ల నుంచి మరింత ఎక్కువ శాతం నీటికి విడుదల చేస్తామని డీఈ చంద్రమౌళి తెలిపారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి







తడ మండలం చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై భారీగా వర్షపు నీరు చేరడంతో ఆగిన వాహనాలు - తిరుపతి ఆర్టీసీ బస్టాండులోకి చేరిన వర్షపు నీరు

● ఫెంగల్ ఎఫెక్ట్

విడవని వాన

నారాయణవనంలో 150.6 మి.మీ

తిరుపతి (కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి: శనివారం వేకువ జాము నుంచి రాత్రి వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. అత్యధికంగా నారాయణవనం మండలంలో 150.6 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా పాకాలలో 27 మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది. సూళ్లూరుపేట 145, తడ 140.8, చిట్టమూరు 135.6, వాకాడు 134.2, పుత్తూరు 133.2, వరదయ్యపాళెం 130, పిచ్చాటూరు 123.8, వడమాలపేట 123.8, దొరవారిసత్రం 122.4, సత్యవేడు 109, కేవీబీపురం 107.6 చొప్పున వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటు వర్షపాతం 86 మిమీ.

- నిండిన కాళంగి, మల్లిమడుగు, స్వర్ణముఖి బ్యారేజీ
- ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- చెరువులు, రిజర్వాయర్లలోకి చేరుతున్న నీరు
- కూలిన 30 విద్యుత్ స్తంభాలు.. రెండు ఇళ్లు
- విమానం దారి మళ్లింపు, పలు సర్వీసులు రద్దు
- విద్యా సంస్థలకు సెలవు



వాకాడు మండలం తూపిలిపాళెం పునరావాస కేంద్రంలో తలదాచుకున్న బాధితులు

తిరుపతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ ప్రభావంతో జిల్లా అంతటా శుక్రవారం రాత్రి నుంచీ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేని వానలకు తోడు ఈదురు గాలులతో చలి పెరిగింది. జన జీవనానికి తీవ్ర అంతరాయం కలిగింది. ఆగకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకల్లో ప్రవాహాలు మొదలయ్యాయి. 30 చెరువులు నిండిపోయి కలుజులు పారుతున్నాయి. మల్లిమడుగు, కాళంగి రిజర్వాయర్లు, స్వర్ణముఖి బ్యారేజీలు నిండిపోయి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇక, పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టులోకి పాతిక అడుగుల మేరకు నీటి మట్టం పెరిగింది. ఆ ప్రాజెక్టు గేట్లను ఎస్పీ సుబ్బరాయుడు పరిశీలించారు. ఇలాగే వర్షం పడితే శనివారం అర్ధరాత్రికి ప్రాజెక్టు నిండిపోయే అవకాశముంది. ఇక, జిల్లాలో 30 దాకా చెరువులు నిండిపోయి కలుజు పారుతున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు.

11 విమానాల రద్దు.. ఒకటి దారి మళ్లింపు

రేణిగుంట, ఆంధ్రజ్యోతి: రేణిగుంట విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు వాతావరణం అనుకూలించకపోవడంతో 12 విమాన సర్వీసులు రద్దయ్యాయి. శనివారం 16 సర్వీసులు నడవాల్సి వుండగా ఉదయం నాలుగు మాత్రం వచ్చి వెళ్ళాయి. ఆ తర్వాత హైదరాబాదు నుంచీ వచ్చిన ఇండిగో విమానం రేణిగుంటలో ల్యాండ్ కాలేకపోవడంతో 15 నిమిషాలపాటు చక్కర్లు కొట్టాక.. దాన్ని బెంగళూరుకు మళ్లించారు. దీంతో ఇండిగో, స్పైస్ జెట్, ఎయిర్ అలయెన్స్, స్టార్ ఎయిర్ లైన్స్ సంస్థలకు చెందిన 11 సర్వీసులను రద్దు చేశారు.

62 బస్సుల నిలిపివేత

తిరుపతి (రవాణా), ఆంధ్రజ్యోతి: పలుచోట్ల కాజ్‌వేలపై నీటి ఉధ్రుతి, వాగులు, వంకలు పొంగుతుండటంతో 62 ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలిపివేశారు. తిరుపతి, తిరుమల, మంగళం, అలిపిరి, శ్రీకాళహస్తి, పుత్తూరు, సత్యవేడు, వాకాడు, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి డిపోల నుంచి పలు నగరాలకు, గ్రామాలకు బస్సులను రద్దు చేశారు. ప్రధానంగా తిరుపతి-చెన్నై నాలుగు ఇంద్ర బస్సులు, తిరుమల-పాపవినాశనం మధ్య 8, తిరుత్తణి-తిరుమల మధ్య మూడు, శ్రీకాళహస్తి-చెన్నై, తిరుపతి మధ్య 4, మిగిలిన మార్గాల్లో ఒక్కోటి చొప్పున రద్దు చేశారు. దాదాపు 150ట్రిప్పులు ఆగాయి.



కేవీబీపురం మండలం బ్రాహ్మణపల్లెలో కింద పడిన విద్యుత్త స్తంభం

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిరుపతి(ఆటోనగర్), ఆంధ్రజ్యోతి: గాలుల తాకిడికి జిల్లాలో 30 విద్యుత్ స్తంభాలు, పలు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. దీంతో పలుచోట్ల కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగి పడటంతో సరఫరా ఆగింది.

కాజ్‌వేపై నీటి ఉధృతితో ఆగిన బస్సు



వరదయ్యపాళెం పట్టణ సమీపంలో..

వరదయ్యపాలెం మండలం గోవర్ధనపురం సమీపంలో మారేడు కాలువ పొంగి ప్రవహిస్తోంది. నీటి ప్రవాహం తక్కువగా ఉందని భావించిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ బస్సును ముందుకు తీసుకెళ్లగా.. కాజ్‌వేపై నీటి ఉధృతిలో ఆగిపోయింది. బస్సులోని 40 మంది ప్రయాణికులు భయాందోళన చెందారు. గ్రామస్తులు చేరుకుని వీరిని క్షేమంగా గట్టుకు చేర్చారు. ఇక, శ్రీకాళహస్తి- సూళ్లూరుపేట నడుమ కొన్నంబట్టు వద్ద నిర్మాణంలో ఉన్న కల్వర్టు వద్ద చెరువు నీరు ఉధృతికి రాకపోకలు ఆగిపోయాయి. ఏర్పేడు మండలం పాపానాయుడుపేట నుంచి గుడిమల్లం వెళ్ళే మార్గంలో సీత కాలువ ప్రవాహ ఉధృతి పెరగడంతో రాకపోకలు ఆగాయి. దీంతో తుపాను ప్రభావం తగ్గేవరకు గుడిమల్లం పరశురామేశ్వర ఆలయానికి భక్తులు రావద్దని సూచిస్తూ అధికారులు ప్రకటన విడుదల చేశారు. మోదుగులపాలెం వద్ద స్వర్ణముఖి నది లో లెవల్ కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తోంది. రేణిగుంట మండలం గాజుల మండ్యం వద్ద కల్లూరు వంక పొంగడంతో అధికారులు రోడ్డును మూసివేశారు.



కోట మండలం వెంకన్నపాళెంలో నీట మునిగిన వరి పైరు, నారుమడులు

ఆస్తి, పంట నష్టాలు

ఏర్పేడు మండలం సీతారామపేటలో అక్కుపల్లి లోకేశ్‌కు చెందిన ఇల్లు కూలిపోయింది. బీఎన్‌కండ్రిగ మండలం కుంభాకంలో చెట్టు విరిగి రేకుల ఇంటిపై పడడంతో ధ్వంసమైంది. తొట్టంబేడు మండలం రౌతు సూరమాల, బీఎన్‌కండ్రిగ మండలం నెరణి కండ్రిగ, కోట మండలం వెంకన్న పాలెం, చిట్టమూరు మండలం, పెళ్ళకూరు మండలం జీలపాటూరు, వరదయ్యపాలెం మండలం అయ్యవారిపాలెం తదితర గ్రామాల్లో వరి పొలాలు నీట మునిగాయి.

నేడూ జిల్లాకు తుపాను ముప్పు

శనివారం రాత్రి ఫెంగల్ తుపాను తీరం దాటినా.. ఆదివారం కూడా జిల్లాకు భారీ వర్షాల ముప్పు పొంచి వుంది. తీవ్రత తక్కువైనా వర్షాలు ఆగకుండా ఇలాగే ఆదివారం కూడా పడితే మాత్రం వాగులు, వంకలు పూర్తిస్థాయిలో ప్రవహించే అవకాశముంది. చెరువులకు, కల్వర్టులకు గండ్లు పడే ప్రమాదముంది. పల్లపు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు పంటలు దెబ్బతినొచ్చు. దీంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

ఆలస్యంగా రైళ్ల రాకపోకలు

తిరుపతి(సెంట్రల్), ఆంధ్రజ్యోతి: చెన్నై నుంచి బయలు దేరవలసిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను తిరువళ్ళూరు నుంచి నడిపినట్లు అధికారులు తెలిపారు. తిరుపతి- చెన్నై మధ్య నడుస్తున్న సప్తగిరి, గరుడాద్రి ఎక్స్‌ప్రెస్‌లు శనివారం తిరువళ్ళూరు నుంచి తిరుపతికి రాకపోకలు సాగించాయి.

పుదుచ్చేరి వద్ద తీరాన్ని తాకి..



పులికాట్‌లో అలల ఉధృతి

సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి: ఫెంగల్ తుపాను పుదుచ్చేరి సమీపంలో తీరాన్ని తాకింది. శనివారం అర్ధరాత్రి తీరాన్ని దాటొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇస్రో ఉపగ్రహాల ద్వారా తుపాను తీవ్రతను, తీరం దాటే సమాచారాన్ని ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తున్నారు. గడిచిన 8 గంటల్లో గంటకు 7 కిలో మీటర్ల వేగంతో కదిలిన ఫెంగల్ తుపాను.. రాత్రి 11.30 గంటలకు తీవ్ర వాయుగుండంగా బలహీనపడుతుందని వాతావరణశాఖ అంచనా. ఈ తుపాను తీరాన్ని తాకడంతో తమిళనాడు, ఆంధ్రాలో తీరం వెంబడి దీని ప్రభావం ఉంటుందని, సముద్రంలో వాతావరణం అల్లకల్లోలంగా ఉండడంతో ఏపీ, తమిళనాడు తీర ప్రాంతాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. తీరం దాటే సమయంలో గంటకు 70 నుంచి 80 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో దాదాపు 20 సెంమీ వర్షపాతంతో పాటు ఆకస్మిక వరదలు వచ్చే అవకాశముందని హెచ్చరికలు జారీ చేశారు. సముద్రం, పులికాట్ సరస్సులో మత్స్యకారులు మరో రెండు రోజుల పాటు వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాల్లో అధికారులను అప్రమత్తం చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొన్నారు. తహశీల్దార్ ఎస్‌వి నరసింహరావు లోతట్టు ప్రాంతాలను పరిశీలించి అక్కడ ప్రజలతో అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నారు.



సూళ్లూరుపేట కోర్టు వద్ద..

మాడవీధుల్లో సింహ వాహన సేవ రద్దు

వాహన మండపంలోనే పద్మావతీ దేవి దర్శనం



వాహన మండపంలో సింహవాహనంపై కొలువుదీరిన అమ్మవారికి భక్తుల హారతులు



తిరుచానూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుపాను నేపథ్యంలో శనివారం ఉదయం నుంచీ జడివాన కురుస్తుండడంతో రాత్రి తిరుమాడవీధుల్లో జరగాల్సిన సింహవాహన సేవను వాహన మండపానికే పరిమితం చేస్తున్నట్లు టీటీడీ ప్రకటించింది. సాయంత్రం ఊంజల్ సేవ జరిగాక సింహవాహనంపై అమ్మవారిని కొలువుదీర్చారు. వాహన మండపం నుంచే భక్తులకు దర్శనమిచ్చారు. మాడవీధుల్లో వేచివున్న భక్తులు వాహనమండపానికి చేరుకుని కర్పూర, నారికేళ హారతులు సమర్పించారు. వర్షం కారణంగా సాయంత్రం నుంచే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ఆలయ పరిసరాలు బోసిపోయాయి. వాహన సేవ ముందు సాంస్కృతిక ప్రదర్శనలకోసం వచ్చిన ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులకు మహతిలో జరుగుతున్న కార్యక్రమాల్లో అవకాశం కల్పించారు.

- మరిన్ని బ్రహ్మోత్సవాల విశేషాలు 8లో..

చంద్రగిరి

ఎడతెరపిలేని వర్షంతో ఇబ్బందులు



గోకులాపురం చెరువు మొరవ పారుతున్న దృశ్యం

చంద్రగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా మండలంలో శనివారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. ఉద్యోగస్థులు, కూలీలు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. రాత్రి 7 గంటల వరకు 29.6 మి.మీ. వర్షపాతం నమోదైయింది. మధ్యాహ్నం నుంచి ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ●పాకాల: మండలంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం చలిగాలులతో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. మధ్యాహ్నం నుంచి పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. ఇళ్లకు వెళ్లడానికి విద్యార్థులు అవస్థలు పడ్డారు. పశువులను మేతకు తీసుకెళ్లడానికి పాడి రైతులు ఇబ్బంది పడ్డారు. ●రామచంద్రాపురం: ప్రస్తుత వర్షానికి గోకులాపురంచెరువు నిండి మొరవ పారుతోంది. అనుపల్లి అడవుల వద్ద నుంచి వచ్చే నీరు సుద్దేటి వంక ప్రవహించి రాయలచెరువుకు నీరు చేరుతుండటంతో నీటి మట్టం పెరుగుతోంది. వరినూర్పుడులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఎయిడ్స్‌వ్యాధి పట్ల అప్రమత్తం: జడ్జి పూర్ణిమాదేవి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి పూర్ణిమాదేవి

పాకాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ బారిన పడకుండా అప్రమతత్తతో మెలగాలని జూనియర్ సివిల్ జడ్జి పి.పూర్ణిమదేవి సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కల్పించారు. ఎయిడ్స్ రావడానికి కారణాలు, నివారణ, చికిత్స గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరవింద్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రమేష్ కుమార్, ఎన్‌సీసీ ఎన్‌ఎస్‌ఎస్, ఆర్‌ఆర్‌సీ అధికారులు ఈశ్వరబాబు, మాశిలామణి, చిట్టికళావతి, న్యాయవాదులు ఎస్‌ఎస్‌ఎం. సలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాల విజేతలు

చంద్రగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఫస్ట్ ఓపెన్ సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో చంద్రగిరిలోని బ్లూమింగ్ బడ్స్ స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో చంద్రగిరి బ్లూమింగ్ బడ్స్ స్కూల్‌కు చెందిన 1వ తరగతి విద్యార్థి రెడ్డిపల్లి కేయాన్ అండర్-6లో 20 కేజీల కేటగిరిలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. 6వ తరగతి విద్యార్థి రెడ్డిపల్లి వరీష్ అండర్-14లో 35 కేజీల కేటగిరిలో ద్వితీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించారు. ఈసందర్భంగా విజేతలను పాఠశాల చైర్మన్ హితేంద్రనాథ్‌రెడ్డితో పాటు కరాటే మాస్టర్ బాలాజీ, ఉపాధ్యాయులు, అభినందించారు

ఎంబీయూ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎంబీయూ అధ్యాపకులు

చంద్రగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేట సమీపంలో మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలోని నిర్వహించిన ఫార్మసీ క్యాంపస్ సెలక్షన్‌లో 48 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విశ్వవిద్యాలయంలో శనివారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించారు. ఇందులో ప్రముఖ ఆరోగ్య సంరక్షణ సంస్థ ఏజీఎస్ హెల్త్ కేర్ ప్రవేట్ లిమిటెడ్ ద్వారా 48 మంది ఎంపికైనట్లు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంబీయూ వైస్ ఛాన్సలర్ నాగరాజరామరావు, వైస్‌ఛాన్సలర్ కరుణాకరన్, రిజిస్ట్రార్ డాక్టర్ సారధి, ఫైనాన్స్ డైరెక్టర్ రవిశేఖర్‌లు అభినందించారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహనా ర్యాలీ



ఎర్రావారిపాలెం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా శనివారం మండల కేంద్రంలో కోర్ సంస్థ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్ సంస్థ ప్రతినిధి తులసి మాట్లాడారు. ఉస్తికాయలపెంట ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధి నివారణ, వ్యాప్తి,సంక్రమణ, అనర్థాలపై అవగాహన కల్పించారు. ర్యాలీలో విజయలక్ష్మి. హెచ్‌ఎం రవీంద్రనాయక్,రాణి, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల బైపాస్ రోడ్డులో కంపు..కంపు



తిరుపతి అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల బైపాస్ రోడ్డులో మురుగు నీరు పారుతూ కంపు కొడుతుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొర్లగుంట జంక్షన్ ఆరోగ్య మెడికల్ షాపు సమీపంలో సైడు కాలువ స్తంభించింది. నిర్మాణ వ్యర్థాలు పేరుకుపోవడంతో కాలువ మునుకుపోయింది. దీంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో పాదచారులు వాటిని తొక్కుకుంటూ నడవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజల అవస్థలను దృష్టిలో ఉంచుకుని వెంటనే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తిరుపతి(సెంట్రల్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ఎక్స్‌ప్రెస్‌లకు అదనపు కోచ్‌లు ఏర్పాటు చేస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనేశ్వర్-తిరుపతి మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్‌లకు రెండు థర్డ్ ఏసీ కోచ్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. అలాగే బెంగళూరు-భువనేశ్వర్, పూరీ-యశ్వంతపూర్ మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్‌లకు రెండు థర్డ్ ఏసీ కోచ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించింది. రూ.3.77 కోట్లు ఆదాయం లభించినట్టు శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 62,147 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 23,096 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



జస్టిస్ హేతురు పుట్టస్వామిగౌడ్ సందేష్

తిరుమల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హేతురు పుట్టస్వామి గౌడ్ సందేష్, ఎమ్మెల్యే ఆదిమూలం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

సిద్ధేశ్వరస్వామి వేలం పాట ఆదాయం రూ.13.31 లక్షలు

ఎర్రావారిపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి); తలకోనలోని సిద్ధేశ్వరస్వామికి వేలం పాట ద్వారా రూ.12.31లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మమత తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన వేలం పాటల్లో తలనీలాలు సేకరణకు రూ.5,80,000, పూజాసామగ్రి విక్రయాలకు రూ.5,75,000, కొబ్బరి చిప్పల సేకరణకు రూ.66,000కు హక్కులు పొందారన్నారు.

యోగా సాధనతో మానసిక వికాసం



శ్లోకాలు పఠిస్తున్న బీవీబీ విద్యార్థులు

తిరుపతిరూరల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): యోగాసాధనతో మానసికవికాసం వృద్ధి చెందుతుందని భారతీయ విద్యా భవన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సత్యనారాయణరాజు అన్నారు. పాఠశాలలో శనివారం మహావతార్ బాబాజీ జయంతిని నిర్వహించారు ఈసందర్భంగా సత్యనారాయణరాజు మాట్లాడుతూ. యోగాసాధనతో ఒత్తిడిని కూడా జయించవచ్చన్నారు. క్రియా యోగా స్పిరిచువల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడారు. పాఠశాల విద్యార్థులు క్రియాయోగా, పతంజలి శ్లోకాలు, ప్రాణాయామం, ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలపై మాట్లాడారు. హెచ్‌ఎం వాణిశ్రీ, టీచర్లు పాల్గొన్నారు.

అవగాహనతో ఎయిడ్స్‌ను నివారించవచ్చు

తిరుపతి(వైద్యం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌ను సంపూర్ణంగా నివారించాలంటే దానిపై అవగాహన కలిగి ఉండాలని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. స్విమ్స్‌లోని శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల లెక్చరర్ గ్యాలరీలో శనివారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కుమార్ మాట్లాడుతూ ఏటా డిసెంబరు ఒకటో తేదీన ప్రపంచ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని ప్రజలకు అవగాహన కల్పించి నివారణకు తగు చర్యలు చేపడతామన్నారు. నా ఆరోగ్యం నా హక్కు అనే నినాదంతో ముందుకు వెళ్లాలని సూచించారు.

శుభ్రతలో నాణ్యత ప్రమాణాలు పాటించండి

తిరుపతి(సెంట్రల్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో ఉన్నత శ్రేణి ప్రయాణికుల సౌకర్యం కోసం సరఫరా చేసే బెడ్ షీట్‌ల శుభ్రతలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రైల్వే కోచింగ్ డిపో అధికారి ఎన్.ప్రణయ్ కుమార్ అన్నారు. శనివారం తిరుపతి రైల్వే స్టేషన్ తూర్పు యార్డులో ఉన్న బట్టలు శుభ్రం చేసే యాంత్రిక ల్యాండ్రీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. యంత్రాలను పరిశీలించారు. శుభ్రం చేసే విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జగన్‌మోహన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి, ఎస్‌ఎస్‌ఈలు సోమశేఖర్, శ్రీనివాసులు ఆయన వెంట ఉన్నారు.

3న స్థానికులకు శ్రీవారి దర్శనం

● రేపు తిరుపతి, తిరుమలలో టోకెన్ల జారీ


తిరుమల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన భక్తులకు టీటీడీ శుభవార్త తెలిపింది. డిసెంబరు 3న శ్రీవారి దర్శనాన్ని కల్పించనున్నట్టు టీటీడీ ప్రకటించింది. గతంలో ప్రతి నెలా మొదటి మంగళవారం స్థానికులకున్న దర్శనాన్ని టీటీడీ రద్దు చేసిన విషయం తెలిసిందే. దీనిని పునరుద్ధరించాలని నవంబరు 18న టీటీడీ బోర్డు నిర్ణయించింది. గతంలో తిరుమల, తిరుపతి అర్బన్, రూరల్‌కే పరిమితం చేయగా.. ఈసారి రేణిగుంట, చంద్రగిరి మండలాలనూ కలిపారు. డిసెంబరు 3న స్థానికులకు దర్శనం కోసం.. 2వ తేదీ ఉదయం 5 గంటలకు తిరుపతి మహతి ఆడిటోరియం, తిరుమలలోని బాలాజీనగర్‌లో కమ్యూనిటీ హాల్‌లో టోకెన్లను జారీ చేయనున్నారు. ఒరిజనల్ ఆధార్‌కార్డు చూపించి టోకెన్లు పొందాలి. ఆదివారం టోకెన్లు జారీ చేయాలని నిర్ణయించినప్పటికీ వర్షాల నేపథ్యంలో సోమవారానికి మార్చారు.

పాపవినాశనం, శ్రీవారిపాదాల మార్గాల మూసివేత

తిరుమల, ఆంధ్రజ్యోతి: వర్షం నేపథ్యంలో తిరుమలలో సందర్శనీయ ప్రదేశాలైన పాపవినాశనం, జపాలి, వేణుగోపాల స్వామి ఆలయం, ఆకాశగంగ, శ్రీవారిపాదాలు, శిలాతోరణం మార్గాలను టీటీడీ శనివారం ఉదయం మూసివేసింది. అలిపిరి, శ్రీవారిమెట్టు నడక మార్గాలపైనా విజిలెన్స్ అధికారులు, సిబ్బంది నిఘా ఉంచారు. తిరుమల ఘాట్లలో తరచూ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. ఒకవేళ కొండచరియలు పడితే స్పందించేలా మూడు బృందాలను టీటీడీ సిద్ధం చేసింది. జలాశయాలపైనా వాటర్‌వర్క్స్ విభాగం ప్రత్యేక దృష్టిసారించింది.

అలిపిరిలో తనిఖీల వైఫల్యం

● అన్యమత వ్యాఖ్యలతోవచ్చిన కారు



అన్యమత వ్యాఖ్యలతో వచ్చిన కారు

తిరుమల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): అలిపిరిలో భద్రతా తనిఖీల వైఫల్యం మరోసారి వెలుగుచూసింది. అన్యమతనానికి చెందిన వ్యాఖలతో కూడిన ఓ కారు తిరుమలకు రావడం విమర్శలకు దారితీసింది. సాధారణంగా రాజకీయ, ఇతర మతాలకు చెందిన ఫొటోలు, గుర్తులు, నినాదాలతో వాహనాలు తిరుమలకు రావడం నిషేధం. వీటిని అలిపిరి చెక్‌పాయింట్ తనిఖీల్లోనే భద్రతా సిబ్బంది గమనించి అడ్డుకోవాలి. ్స అయితే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇతర మతానికి చెందిన వ్యాఖ్యలతో కూడిన కారు నేరుగా తిరుమలకు చేరుకుంది. పైగా కారును ఆలయానికి సమీపంలోని అర్చక నిలయం వద్ద పార్కింగ్‌లో ఉంచడం చర్చనీయాంశమైంది.

తిరుమలలో ఇటు జోరు వాన...అటు వణికించిన చలి





తుపాన్ ప్రభావంతో తిరుమల క్షేత్రంలో శనివారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దీంతో శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, అఖిలాండం, అన్నప్రసాద భవనం, వైకుంఠం క్యూకాంప్లెక్స్ వంటి ప్రాంతాలతో పాటు రోడ్లు, కాటేజీలు, బస్టాండ్, పార్కులు తడిసి ముద్దయ్యాయి. చలిగాలులతో కూడిన వర్షానికి యాత్రికులు వణికిపోయారు. చంటిపిల్లలు, వృద్ధులతో వచ్చిన భక్తులు ఆగచాట్లు పడ్డారు.కొంతమంది షెడ్లు, కార్యాలయాలు, యాత్రికుల వసతి సముదాయాల వద్ద తలదాచుకున్నారు. వర్షం కారణంగా సాయంత్రం ఆలయం ముందు నిర్వహించే సహస్రదీపాలంకరణ సేవను వైభవోత్సవ మండపంలో నిర్వహించారు. జీఎన్సీ టోల్‌గేట్ వద్ద, అలిపిరి చెక్‌పాయింట్లలోని సెక్యూరిటీ సిబ్బంది వాహనదారులకు పలు జాగ్రత్తలు చేశారు. ఘాట్‌రోడ్డులో మలుపులు తిరిగేటప్పుడు నెమ్మదిగా ప్రయాణించాలని సూచించారు.

-తిరుమల (ఆంధ్రజ్యోతి)

కార్తీక మాసాన.. కనువిందుగా కళా విన్యాసం





ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుపతిలోని పలు కళా వేదికలపై చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు కనులవిందుగా సాగుతున్నాయి. తిరుచానూరు ఆస్థాన మండపంలో ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు మంగళ ధ్వని, ఎస్వీ వేద అధ్యయన సంస్థ పండితుల చతుర్వేద పారాయణం నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన పరకాలన్ బృందం ధార్మికోపన్యాసం, ఆర్తి బృందంతో భక్తి సంగీత కార్యక్రమాన్ని చేపట్టారు. మధ్యాహ్నం తిరుపతికి చెందిన విజయకుమారి బృందం హరికథా పారాయణం చేశారు. సాయంత్రం బుల్లెమ్మ బృందం అన్నమయ్య విన్నపాలు, సాయంత్రం ఊంజల్ సేవలో శివరత్నం బృందం అన్నమయ్య సంకీర్తనలను సుమధురంగా గానం చేశారు. మహతి కళాక్షేత్రంలో తిరుపూర్‌కు చెందిన నరసింహారావు బృందం భక్త రంజని, ఇతర కళాకారులచే కూచిపూడి నృత్యం ఆకట్టుకున్నాయి. అన్నమాచార్య కళామందిరంలో బీఎన్ రెడ్డి భరత నాట్యం ఆహూతులను కట్టి పడేసింది. రామచంద్ర పుష్కరిణి వద్ద లలిత హయగ్రీవ నారాయణాచార్యులు భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించారు. శిల్పారామంలో బాలాజీ బృందం నిర్వహించిన లయ విన్యాసం, భరత నాట్య ప్రదర్శన అలరించాయి.

కుంభమేళాలో శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటుకు టీటీడీ సన్నాహాలు

● స్థలాన్ని పరిశీలించిన టీటీడీ జేఈవో గౌతమి,అధికారులు



స్థలాన్ని పరిశీలిస్తున్న జేఈవో గౌతమి,అధికారులు

తిరుమల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయోగరాజ్(అలహాబాద్)లో వచ్చే ఏడాది జనవరి 13 నుంచి నిర్వహించనున్న ప్రతిష్టాత్మక కుంభమేళాలో హిందూ ధర్మ ప్రచారం కోసం టీటీడీ భాగం కానుంది. ఇక్కడ టీటీడీ నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈక్రమంలో టీటీడీ జేఈవో గౌతమి ఉత్తరప్రదేశ్‌లో కుంభమేళా అధికారి విజయ్‌కిరణ్ ఆనంద్‌ను శనివారం కలిశారు. ప్రయోగరాజ్‌లో శ్రీవారి నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేసేందుకు కుంభమేళా అధికారులు టీటీడీకి ఆరో సెక్టార్‌లో 2.50 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. జేఈవో ఆ స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. కుంభమేళా భక్తులను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరిశీలించిన బృందంలో రామ్‌రఘునాథ్, జగదీశ్వర్‌రెడ్డి, ఈఈ సురేంద్రనాథ్‌రెడ్డి ఉన్నారు.

అమ్మవారి విశ్రాంతి ఇక్కడే..




గంగుండ్ర మండపం

తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి ఉత్తరం దిక్కులో ఉన్న గంగుండ్ర మండపం అమ్మవారికి విశ్రాంతి మండపం. ఇక్కడ అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. 1868 ప్రాంతంలో బ్రిటీష్ ప్రభుత్వంలో తిరుమల, తిరుపతి తాలూకా తహసీల్దార్ ఎస్.వెంకటరంగ అయ్యంగార్ దీనిని నిర్మించారని చెబుతారు.. అమ్మవారి బ్రహ్మోత్సవ వాహనసేవలను తిలకించేందుకు వచ్చిన ఆయన.. వాహన సేవకులు, అర్చకులు, అధికారులు అలసిపోవడాన్ని గుర్తించి, వీరంతా కొంతసేపు విశ్రాంతి తీసుకునేందుకు ఈ మండపం నిర్మించి ఇచ్చారు. ఇక్కడ సమర్పించే నైవేద్యాన్ని భక్తులకు, అధికారులకు, వాహన సేవకులకు పంచి పెడతారు. వెంకట రంగ అయ్యంగార్ వంశస్తులు బయట ప్రాంతంలో స్థిరపడినప్పటికీ ఏటా బ్రహ్మోత్సవాలకు విచ్చేసి అమ్మవారిసేవలో తరిస్తున్నారు.

-తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

రూ.5.5 కోట్ల విలువైన మైక్రోస్కోప్ ప్రారంభం

● ఎస్వీయూ పర్స్ సెంటర్‌లో ఏర్పాటు



మైక్రోస్కోప్‌ను ప్రారంభిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలోని పర్స్ సెంటర్‌లో రూ.5.5 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన అత్యంత అధునాతనమైన మైక్రోస్కోప్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు శనివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ జీవ, లోహ, రసాయన, నానో టెక్నాలజీ పరిశోధనలకు ఈ మైక్రోస్కోప్ ఎంతో ఉపకరిస్తుందన్నారు. వైరస్, లోహ కణాలు లక్ష రెట్లు పెద్దదిగా చేసి చూడవచ్చని తెలిపారు. నానో స్కేల్ పరికరాల నిర్మాణాన్ని విశ్లేషించడానికి అవకాశం కలుగుతుందన్నారు. పర్స్ సెంటర్ డైరెక్టర్, వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మాట్లాడుతూ హెచ్ ఆర్‌టీఈఎం జోయల్ జెం-2100 పేరుగా గల ఈ మైక్రో స్కోప్ ద్వారా క్లిష్టమైన అంశాలను పరిశీలించేందుకు ఉపయోగపడుతుందన్నారు. సైన్స్, ఇంజినీరింగ్ పరిశోధనల్లో ప్రగతి, ఫలితాలు సాధించడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో పుస్తకాల ఆవిష్కరణ



ముత్యపు పందిరి వాహనసేవలో ఆధ్యాత్మిక పుస్తకాలు ఆవిష్కరిస్తున్న టీటీడీ అధికారులు

తిరుచానూరు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం ముత్యపు పందిరి వాహనసేవలో నాలుగు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ ఈవో జె.శ్యామలరావు ఆవిష్కరించారు. 'భాగవత గాథలు - మహిళలు, మహాభారత గాథలు - మహిళలు, రామాయణ గాథలు - మహిళలు, ఆర్యకథానిధి' పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ, ఉపసంపాదకులు డాక్టర్ నరసింహాచార్య, రచయితలు కె.సర్వోత్తమ్మరావు, సుమతీ నరేంద్ర, కోలవెన్ను మలయవాసిని, సుబ్బరావులు పాల్గొన్నారు.

వానలోనూ కొనసాగిన పింఛన్ల పంపిణీ



పాకాలలో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాని

పాకాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం వర్షం పడుతున్నా పింఛన్ల పంపిణీ కొనసాగింది. పాకాల పంచాయతీ గాంధీనగర్‌లో ఎమ్మెల్యే పులివర్తి నాని ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను పంపిణీ చేశారు. వర్షంలోనే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ఎమ్మెల్యే పెన్షన్లు అందజేశారు. వారి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈనెల ఒకరోజు ముందుగానే పెన్షన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ● భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలో శనివారం జోరువానలోనూ కొనసాగించారు. 4723 మందికిగాను 4521 మందికి పంపిణీ చేసి 95.48 శాతంతో జిల్లాలో రెండవ స్థానంలో నిలిచింది. ఎంపీడీవో గిడ్డయ్య స్వయంగా క్షేత్రస్థాయిలో తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. ● చంద్రగిరి: మండలంలో 8261 మంది పెన్షన్ దారులకుగాను 7832 మందికి సచివాలయం సిబ్బంది అందజేశారు.

విపత్తును ఎదుర్కోవడానికి సన్నద్ధం

● అవసరమైతే తప్ప ప్రయాణాలు వద్దన్న కలెక్టర్

● అప్రమత్తంగా ఉండాలన్న ఎస్పీ

తిరుపతి (కలెక్టరేట్/వైద్యం), ఆంధ్రజ్యోతి: తుపాను నేపథ్యంలో ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం తెలిపారు. అవసరమైతే తప్ప ప్రజలు ప్రయాణాలు చేయవద్దని సూచించారు. చెరువులు, వాగులు, వంకలు పొంగినీరు ప్రవహిస్తున్న దృష్ట్యా ఎవరూ దాటే ప్రయత్నం చేయొద్దన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కలెక్టరేట్లోని 0877-2236007కు ప్రజలు సమాచారం ఇవ్వవచ్చన్నారు. సుమారు 20 విద్యుత్ స్తంభాలు కూలగా.. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, తుపాను నేపథ్యంలో పోలీసు యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందించాలన్నారు. వాగులు, వంకలు, లోతట్టు ప్రాంతాల వద్ద భద్రతా చర్యలు చేపట్టి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పాత భవనాల్లో ఉండే వారిని ఖాళీ చేయించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112, 80999 99977 నెంబర్లకు ఫోను చేయాలని సూచించారు.

అరణియార్ గేట్లను పరిశీలించిన ఎస్పీ

పిచ్చాటూరు. నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టు గేట్లను ఎస్పీ సుబ్బారాయుడు శనివారం సాయంత్రం పరిశీలించారు. అరణియార్ ఇన్‌ఫ్లో 3500 క్యూసెక్కులుగా ఉందని, ప్రాజెక్టు నీటి మట్టం 27 అడుగులకు చేరిన వెంటనే గేట్లను పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేస్తామని ఏఈ లేకేశ్వర్ రెడ్డి చెప్పారు. గేట్లను పైకెత్తే ముందు అరుణా నది పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాలతో పాటు, తమిళనాడులోని జిల్లా కలెక్టర్లు, ఇరిగేషన్ శాఖ అధికారులకు ముందస్తు సమాచారం అందిస్తామన్నారు. డీఎస్పీ రవికుమార్, సీఐ రవీంద్ర, ఎస్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జడివాన..చలిగాలి

- తుఫాన్‌తో తిరుపతిలో స్తంభించిన జనజీవనం
- కార్పొరేషన్లో హెల్ప్‌లైన్ సెంటర్

తిరుపతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావం తిరుపతితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్రంగా కనిపించింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు అడపాదడపా చిరుజల్లులతో పాటు ఈదురుగాలులు వీచాయి. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. జనజీవనం స్తంభించింది. నగరంలోని మధురానగర్, లక్ష్మీపురం, పద్మావతీపురం, కట్టకింద ఊరు వంటి ప్రాంతాల్లో మురికి నీటితో కలిసిన వర్షపు నీరు వీధుల్లో పారడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. కపిలతీర్థం నుంచి ప్రవహించే వర్షపు నీరు శివజ్యోతి నగర్, మాల్వాడిగుండం జలపాతం నుంచి వచ్చే ఎస్టీవీఎస్ కాలువ మీదుగా రెండూ కలిపి సుభాష్ నగర్ కూడలిలో కలిసి పాన్‌చెరువు మీదుగా మంగళం చెరువు దాని సమీపంలోని చెరువుల్లో చేరుతోంది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది. రుయా, స్విమ్స్ ఆస్పత్రిలోని రోగులు, అటెండర్లు వర్షం, చలికి ఇబ్బందులు పడుతున్నారు. 62 ఆర్టీసీ బస్సులు రద్దు కావడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. గమ్యస్థానాలకు చేరడానికి ఇబ్బందులు పడాల్సి వచ్చింది. డీఆర్‌మహల్, వెస్ట్ చర్చివద్దగల అండర్ బ్రిడ్జిల వద్ద చేరుతున్న నీటిని తొలగించే ఏర్పాట్లలో కార్పొరేషన్ యంత్రాంగం తలమునకలవుతోంది. కాలువలో నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటోంది.

● అందరూ అందుబాటులో ఉండాలి : కమిషనర్ మౌర్య

తుఫాన్ నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. శనివారం అధికారులతో కలసి ఆమె లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. అన్నమయ్య సర్కిల్, ఎమ్మార్‌పల్లి, వెస్ట్ చర్చి రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను హెల్త్, ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. రోడ్లపైకి నీరు రాకుండా కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్త, మురుగు తొలగించాలన్నారు. పలుచోట్ల డివైడర్లు పగిలి ఉండడం, ఫుట్‌పాత్‌లపై గుంతలు ఉండడాన్ని గుర్తించి మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎంఈ తులసీకుమార్, తుడా ఈఈ రవీంద్ర, డీఈ మహేష్, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య ఆమె వెంట ఉన్నారు.

● హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోండి

తుఫాన్ వల్ల ఇబ్బందులు తలెత్తినప్పుడు సహాయక చర్యల కోసం తిరుపతి నగర పాలక సంస్థలో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. నీరు నిలిచిపోవడం, చెట్లు పడిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తినప్పుడు 900822909, 0877-2256766 నెంబర్లకు ఫోన్ చేయాలని కమిషనర్ కోరారు. శనివారం సాయంత్రం హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఆమె పరిశీలించి ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? అవి ఎలాంటివి? వాటికి పరిష్కారం జరిగిందా? లేదా? అని ఆరా తీశారు.


కపిలతీర్థంలో ఫొటోల సందడి

రుయాలో రోగుల అవస్థలు

తిరుపతి(వైద్యం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చలిగాలులతో కూడిన జోరు వర్షంతో రుయాలో రోగులు, వారి సహాయకులు అవస్థలు పడుతున్నారు. అత్యవసర విభాగం ముందు షెడ్లు ఉన్నా అవి యాచకులకు అడ్డాగా మారిపోయాయి. దీంతో రోగుల సహాయకులు తడిసి ముద్దావ్వాల్సిన పరిస్థితి నెలకొంది. చలిగాలులకు పరిస్థితి మరింత దయనీయంగా మారింది.







లడ్డూలో పందికొవ్వుపై నిగ్గుతేల్చాలి

- జగన్ రెడ్డికి ఇంకా బుద్ధి రాలేదు
- టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ఓవీ రమణ



తిరుపతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూకు ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిన మాట వాస్తవమేనని, అయితే పంది కొవ్వును కలిపారన్న అనుమానాలున్నాయని, ఆ విషయాన్ని సిట్ అధికారులు నిగ్గు తేల్చాల్సి ఉందని టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు, టీడీపీ నేత ఓవీ రమణ కోరారు. కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలతో గత ప్రభుత్వం ఆటలాడుకుంటుందని, త్వరితగతిన సిట్ విచారణ పూర్తి చేసి, హిందూ సమాజానికి స్పష్టత ఇవ్వాలని అన్నారు. అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. ఆయన చేసిన ఘనకార్యాలు, కుంభకోణాలకు శాలువా కప్పి సన్మానం చేయాలా? అని ప్రశ్నించారు. అక్రమ కేసులు పెడుతున్నారని జగన్ చేస్తున్న రాద్ధాంతం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్ ఏ స్థాయిలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారో ప్రజలు చూశారన్నారు. అందుకే 11 సీట్లకు పరిమితం చేసి ఇంట్లో కూర్చోబెట్టారన్నారు. ప్రజలు అసహ్యించుకున్నా వైసీపీ అధినేతకు ఇంకా బుద్ధి రాలేదని మండిపడ్డారు.30 శ్రీకాంత్3: మట్టితో పూడ్చిన గుంతలు

వర్షం పడితే అంతే..!


చెరువును తలపించేలా రోడ్డుపై నిలిచిన నీరు

తిరుపతి (జీవకోన), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి - కరకంబాడీ రోడ్డులోని (భూపాల్ హౌసింగ్ కాలనీ సమీపంలో) కొండా కల్యాణ మండపానికి ముందు చిన్నపాటి వర్షం పడినా రోడ్డుపై నీరు నిలుస్తోంది. కాలువలు లేకపోవడంతో నీరు పోవడానికి ఆస్కారం లేకుండా పోయింది. శనివారం కురిసిన వర్షానికి రోడ్లంతా జలమయంగా మారింది. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.

డీసీటీఎంకు సన్మానం



తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎం.భాస్కర్‌ను శనివారం ఆర్టీసీ అధికారులు ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జ్ డీపీటీవో జగదీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అధికారులు ఆయన సేవలను కొనియాడారు. డిప్యూటీ సీఎంఈ నరసింహులు, డిపో మేనేజర్లు విశ్వనాథం, రామచంద్రనాయుడు, హరిబాబు, భాస్కర్, డీఈ చెన్నకేశవులు, మెకానిక్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

క్రీడాకారులను సన్మానించిన శాప్ చైర్మన్



సింధూర్‌ను, భవిష్య, సంజనలను అభినందిస్తున్న శాప్ చైర్మన్

తిరుపతి(క్రీడలు), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు శనివారం పలువురు క్రీడాకారులను సన్మానించారు. టీటీడీ ఉద్యోగి గోపినాయుడు(తైక్వాండో శిక్షకుడు) శనివారం శాప్ చైర్మన్‌ను కలసి ఇద్దరు కుమార్తెలు భవిష్య, సంజనలను పరిచయం చేశారు. తైక్వాండో, ఫెన్సింగ్ క్రీడలలో జాతీయ స్థాయిలో రాణించినట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా రవినాయుడు ఇరువురికి శాలువకప్పి ఘనంగా సన్మానించారు. అథ్లెటిక్ క్రీడాకారులు కలవగా అందులో తిరుపతికి చెందిన డి.సింధూర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

6న తిరుమల మహా పాదయాత్ర

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈనెల ఆరో తేదీన తిరుమల మహా పాదయాత్ర ప్రారంభం కానున్నట్లు అన్నమయ్య జిల్లా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అనుచరులు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్లు విడుదల చేశారు. రాజంపేట మండలం ఆకేపాడు నవోదయ కాలనీ సముదాయంలోని ఆకేపాటి లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి గోవిందమాలలు ధరించిన వేలాది మంది భక్తులతో మధ్యాహ్నం 2 గంటలకు యాత్ర ప్రారంభమవుతుందని, 9న ఉదయం 6 గంటలకు తిరుమలకు చేరుకుంటుందని తెలిపారు.

మాలల సింహగర్జనకు తరలిరండి

తిరుపతి అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సికింద్రాబాదు పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించే మాలల సింహగర్జనకు జిల్లాలోని మాల ఉద్యమకారులు, ప్రజాసంఘాలు, మేధావులు, ఉద్యోగ, యువజన, విద్యార్థి సంఘాల నేతలు తరలిరావాలని దళిత సంఘం సీనియర్ నేత మల్లారపు మధు శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాజకీయం కోసం మాల, మాదిగలను విడగొడుతున్న వారికి గుణపాఠం చెప్పాల్సిన బాధ్యత దళితులపై ఉందని పేర్కొన్నారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

తిరుపతి(జీవకోన), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతినెలా మొదటి మంగళవారం తిరుమల శ్రీవారి దర్శనం కల్పిస్తూ తిరుపతివాసుల చిరకాల వాంఛను కూటమి ప్రభుత్వం నెరవేర్చి మాట నిలబెట్టుకుందని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు చేతులమీదుగా మొదటి దర్శనం టోకెన్లు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట, తిరుపతి రూరల్ వాసులకు ఆధార్ కార్డు ఆధారంగా శ్రీవారి దర్శనం దైవానుగ్రహమని తెలిపారు. టోకెన్ల విడుదల కేంద్రాల వద్ద ఎటువంటి సిఫారసులకూ ఆస్కారం లేకుండా విజిలెన్స్ పోలీసు అధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా క్యూలు ఏర్పాటు చేయాలన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

తిరుపతిలో అత్యధికంగా పింఛన్ల పంపిణీ



లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో 18,992 మంది లబ్ధిదారులకు గాను శనివారం రాత్రి 7 గంటల సమయానికి 18,242 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. 98.27 శాతం తొలిరోజు పంపిణీ చేశారు. టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్ 36వ డివిజన్లో కూటమి నేతలు రవిశంకర్, శంకర్ యాదవ్, ఆముదాల వెంకటేష్‌తో కలసి పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. 35వ డివిజన్లో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ నాయకులు ఎస్వీఎం శ్రీధర్, జగన్నాథం, మహాలక్ష్మి, సుజాతమ్మ, రవితేజ, రూపేష్‌లతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు.

సుదర్శన్‌రాజు సేవలు భేష్


సుదర్శన్‌రాజును సన్మానిస్తున్న శంకరరావు

తిరుపతి(సెంట్రల్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వేలో 30 ఏళ్లుగా ఉద్యోగిగా రైల్వేకు, నాయకుడిగా మజ్దూర్ యూనియన్‌కు కె.సుదర్శన్ రాజు చేసిన సేవలు అమోఘమని, అభినందనీయమని ఆ యూనియన్ జోనల్ కార్యదర్శి సీహెచ్ శంకరరావు అన్నారు. శనివారం బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో సుదర్శన్ రాజు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో రాజు సేవలు మరువలేనివన్నారు. అనంతరం సుదర్శన్‌రాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కళాధర్, ఉదయ్ భాస్కర్, చిన్నప్పరెడ్డి, మధుసూదన్, బుచ్చిరెడ్డి, రవీంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సంగీత నీరాజనం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియంలో ఆదివారం కృష్ణవేణి సంగీత నీరాజనం నిర్వహించనున్నారు. పర్యాటక, సాంస్కృతిక, టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి. సాయంత్రం 5 గంటలకు ప్రఖ్యాత సంగీత విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ నేతృత్వంలో కర్ణాటక గాత్ర సంగీత కచేరి నిర్వహిస్తారని ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్ తెలిపారు.


తిరుచానూరు పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రామచంద్ర పుష్కరిణిలో గానకచేరి చేస్తున్న తాళ్లపాక హయగ్రీవ నారాయణాచార్యులు

ఉద్యోగ విరమణ చేసినా పోలీసులుగానే గుర్తుండిపోతారు


ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులతో ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(వైద్యం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో ఉద్యోగ విరమణ పొందినా సమాజానికి పోలీసులుగానే గుర్తుండిపోతారని, జీవితకాలం క్రమశిక్షణతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన పలువురు ఎస్సైలకు, కానిస్టేబుళ్లకు పోలీసు అతిథిగృహంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం అంటేనే ఒక బాధ్యతన్నారు. అలాంటి బాధ్యతను ఇన్నేళ్లు క్రమశిక్షణతో నిర్వర్తించిన అందరికీ అభినందనలు చెబుతున్నానని అన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఎస్సైలు నిత్యానందపిళ్లై, రామకృష్ణారెడ్డి, ట్రాఫిక్ ఏఎస్సై మణి, ఎస్వీయూ స్టేషన్ ఏఎస్సై భాస్కర్, హెడ్ కానిస్టేబుళ్లు సురేంద్ర, కోదండపాణి, వెంకట్రావులను ఆయన సన్మానించి, జ్ఞాపికలు అందించారు. ఏఎస్పీ రవిమనోహరాచారి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, కార్యదర్శి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కాలభైరవ హోమం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కపిలేశ్వరాలయంలో శనివారం కాలభైరవ హోమం శాస్త్రోక్తంగా సాగింది. యాగశాలలో ఉదయం పూజ అష్టభైరవ హోమం, మహా పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మహాశాంతి అభిషేకం, కలశాభిషేకం, నివేదన, హారతి నిర్వహించారు. సాయంత్రం చండికేశ్వరస్వామి కలశ స్థాపన, పూజ, జపం, హోమం, విశేష దీపారాధన నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం చండికేశ్వర హోమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్ర, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ


కార్యక్రమంలో భజన మండలి కళాకారులు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గోవింద నామస్మరణతో మార్మోగింది. భజన కళా మండలి ఆధ్వర్యంలో ప్రతి శనివారమూ నగర సంకీర్తన నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నగరంలోని ప్రధాన వీధుల్లో తెల్లవారుజామున నుంచే సంప్రదాయ దుస్తుల్లో తిరునామం ధరించి మంగళ వాయిద్యాలతో గోవిందనామ సంకీర్తనలు ఆలపించారు. నగర సంకీర్తన అనంతరం అన్న ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుండాల గోపీనాథరెడ్డి, చిత్తరువు హనుమంతరావు, తొండమనాటి సుబ్రమణ్యం, కల్యాణి, జయమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

గుంతలను పూడ్చారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


మట్టితో పూడ్చిన గుంతలు

తిరుపతి (జీవకోన), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల బైపాస్ రోడ్డు నుంచి సత్యనారాయణపురం, జీవకోనకు వెళ్లే విరజా మార్గం ప్రధాన రోడ్డు గుంతలమయంగా ఉండేది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో ఈనెల 27వ తేదీన ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో అన్న శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తాత్కాలికంగా గుంతలకు మట్టిపోసి చదును చేశారు. దీంతో వాహనదారులకు కొంతమేర ఉపశమనం లభించింది.

ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పద్మావతి డిగ్రీ కాలేజీలో శనివారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ మాట్లాడుతూ వ్యక్తిగత క్రమశిక్షణ, రక్తమార్పిడి సమయంలో జాగ్రత్తలతో ఎయిడ్స్‌కు దూరంగా ఉండొచ్చని తెలిపారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కృష్ణవేణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ దేవప్రసాదరాజుకు సన్మానం


దేవప్రసాదరాజును సన్మానిస్తున్న వీసీ విజయభాస్కరరావు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ దేవప్రసాదరాజును నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ విజయభాస్కరరావు సత్కరించారు. ఇటీవల ఫిజిక్స్ విభాగాధిపతిగా ప్రొఫెసర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో వీసీ విజయభాస్కరరావు సత్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆర్వీ విజయలక్ష్మి పాల్గొన్నారు.



నందికి జలపాతాభిషేకం

పులకించిన నగరం

కొండకోనల్లో కురిసిన చినుకులు పాయలై పారి.. వాగులై ఉరికి.. జలపాతాలై దూకాయి. రాత్రి నుంచీ కురుస్తున్న వానలో తడిచి, తలకిబోసుకున్న ప్రకృతి కన్యలా తిరుమల కొండలు కళకళలాడుతున్నాయి.. మాలాడగుండం, కపిలతీర్థం జలపాతాలు తిరుమల భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. కొండ సిగలో మెరుస్తున్న ఈ తెల్ల జలవంకలను చూస్తూ నగరవాసులు మురిసిపోతున్నారు. వాన పెంచిన చలికి జనం మరింత ముడుక్కుని గడుపుతున్నారు. చిన్నాచితకా వ్యాపారాలన్నీ గొడుగుల కిందకు చేరుకున్నాయి. శనివారం నాటి వాన దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్లు అందిస్తున్నారు.



గోపురానికి నమస్కరిస్తున్న కపిలతీర్థం



గొడుగుల కింద తలదాచుకున్న కూరగాయల మార్కెట్






వాహనసేవలో కళా నీరాజనం

ముత్యపు పందిరి వాహనసేవలో వివిధ రాష్ట్రాలకు చెందిన 12 కళా బృందాలలోని 272 మంది కళాకారులు అమ్మవారికి కళా నీరాజనం సమర్పించారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన కళాకారులు కథక్, భరతనాట్యం, కూచిపూడి కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. కంజీర కోలాటం, పిల్లనగ్రోవి వంటి జానపద నృత్యాలను ప్రదర్శించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జల్లుల మధ్య తిరుపతి ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలకు చెందిన విద్యార్థులు పౌరాణిక పాత్రలను పోషించి భక్తులను అలరించారు.

ముత్యపు పందిరిపై పద్మావతమ్మ



రాలిన చినుకు.. నత్త గర్భంలో ముత్యంగా మారుతుంది. కురుస్తున్న చినుకుల్లో ఆ ముత్యాల వాహనంలోనే పద్మావతీ దేవి తిరుచానూరు మాడవీధుల్లో ఊరేగారు. కార్తీక బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం ముత్యపు పందిరిపై అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వర్షంతో పటాటోపం కిందనే ఊరేగింపు సాగింది. మేళతాళాలు, భజన, కళాబృందాలు తడుస్తూనే ప్రదర్శనలు ఇచ్చారు. పండితులు గొడుగుల కిందకు చేరి వేదపారాయణం సాగించారు. కార్యక్రమాల్లో జీయర్ స్వాములు, టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

- తిరుచానూరు,ఆంధ్రజ్యోతి



వర్షంలోనూ.. ఒకరోజు ముందుగానే..!

- ఇంటింటికీ పింఛన్ల పంపిణీ
- జిల్లాలో 92 శాతం పూర్తి



శనివారం ఉదయం వాన పడుతున్నా పిచ్చాటూరులో పింఛను పంపిణీ

తిరుపతి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): డిసెంబరు ఒకటో తేది ఆదివారం సెలవుదినం. దీంతో ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఎడతెరపని వర్షంలోనూ ఉదయం 5 గంటల నుంచే సచివాలయ సిబ్బంది ఆయా పరిధిలోని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందించారు. పలుచోట్ల కూటమి నేతలు పంపిణీని పర్యవేక్షించారు. వాన పడుతున్నా జిల్లాలో 92 శాతం పంపిణీ పూర్తి చేశారు. 264636 మంది లబ్ధిదారులకు గాను 243491 మందికి జిల్లాలో అందించినట్టు డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు తెలిపారు. అది, సోమవారాల్లోనూ పింఛన్లు పంపిణీ పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు.

స్వర్ణమ్మకు హారతులు



గంగాదేవికి పూజలు

శ్రీకాళహస్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):కార్తీక మాసం అమావాస్యను పురస్కరించుకుని శ్రీకాళహస్తిలో శనివారం సాయంత్రం స్వర్ణమ్మకు హారతులు సమర్పించారు. ముక్కంటి ఆలయంలో గంగాదేవి ఉత్సవ మూర్తిని అలంకరించి స్వర్ణముఖి నదిలోని సద్యోముక్తి ప్రదేశం వరకు తీసుకొచ్చారు. పండితులు నదీజలాలకు, అమ్మవారి ఉత్సవ మూర్తికి పూజలు చేశారు. అర్చకులు స్వర్ణమ్మకు ద్వాదశ హారతులు పట్టారు. ఆగమ నియమాల ప్రకారం గంగమ్మకు వరుసగా హారతులను సమర్పించారు.వేదఘోష మధ్య దీపకాంతులను దర్శిస్తూ పలువురు భక్తులు నదిలో దీపాలు వెలిగించి వదిలారు. నదీ హారతుల సందర్భంగా ఈ ఏడాది ఏర్పాటు చేసిన లేజర్‌షో ఆకట్టుకుంది. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, బొజ్జల బృందమ్మ, ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి, టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలో శనివారం వేకువజాము నుంచి సాయంత్రం వరకు వర్షం విడవకుండా కురిసింది. నదీ హారతుల కోసం ఆలయం నుంచి గంగాదేవి ఉత్సవమూర్తి బయలుదేరిన వెంటనే నిలిచిపోయి.. హారతుల ఘట్టం ముగిశాక వర్షపు జల్లులు పడటం గమనార్హం.



యువకుడి దారుణహత్య

ఉసురు తీసిన వివాహేతర సంబంధం

శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం కారణంగా యువకుడు హత్యకు గురయ్యాడు. శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు పంచాయతీ ఓటుగుంట సెంటర్‌కు చెందిన రవి(20) భవన నిర్మాణ కార్మికుడు. ఇదే సెంటర్‌కు చెందిన ఆర్ముగం అతనికి సమీప బంధువు. కొంతకాలంగా ఆర్ముగం కుటుంబసభ్యురాలితో రవి వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. దీనిపై ఆగ్రహించిన ఆర్ముగం శనివారం రాత్రి రవి ఇంటి వద్దకు కత్తితో వెళ్లాడు. మాటా మాటా పెరగడంతో రవిపై కత్తితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవి నాయక్, ఎస్ఐ మధు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆర్ముగంను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

స్విమ్స్‌కు రూ.10 లక్షల విరాళం

తిరుపతి(వైద్యం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హైదారాబాదుకు చెందిన ఇడిముక్కల హాసిని రూ.10 లక్షల విరాళం అందజేశారు. స్విమ్స్‌లో శనివారం డైరెక్టర్ ఆర్వీకుమార్‌ను కలిసి డీడీని అందించారు. హాసిని మాట్లాడుతూ తన తాత ఇడిముక్కల యతిరాజయ్య జ్ఞాపకార్థం ఈ నగదును అందిస్తున్నట్లు తెలిపారు. హాసిని కుటుంబ సభ్యులు శ్రీనివాసరావు, స్రవంతి, రాజేష్ బాబు పాల్గొన్నారు.



రేణిగుంట మండలం గాజులమండ్యం- కల్లూరు గ్రామాల మధ్య వాగు ఉధృతితో మూసేసిన రోడ్డు

ఒకటే వాన

జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి వానలు విస్తారంగా పడుతున్నాయి. దీంతో వాగులు, వంకల్లో నీటి ప్రవాహం మొదలైంది. పలుచోట్ల రోడ్లపై నీళ్లు చేరాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పలుచోట్ల పొలాల్లోకి నీళ్లు చేరాయి. జనజీవనానికి ఇబ్బందగా మారింది. చిరు వ్యాపారులు అవస్థలు పడ్డారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్ వర్క్



దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళెం వద్ద వెదురుపట్టు రోడ్డులోని వంతెనపై ప్రవహిస్తున్న పాలకాలువ.. పాలకాలువ వరదను పరిశీలిస్తున్న తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్దన్ తదితరులు



నాయుడుపేట లోతువానిగుంట బీసీ బాలుర వసతిగృహం వద్దకు చేరుకున్న వర్షపునీరు



కోట మండలం విద్యానగర్ స్టేట్‌బ్యాంకు వద్ద..



తిరుపతిలో



పుత్తూరు పట్టణ సమీపంలో భవానీనగర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పుకాలువ



బీఎన్‌కండ్రిగ మండలం కనమనంబేడులోని చెరువు కట్టపై కూలిన వృక్షం



నారాయణవనం మండలం తిరువట్యం కాజ్‌వేను పరిశీలిస్తున్న ఎస్ఐ రాజశేఖర్



పునరావాస కేంద్రంలో ఉన్న ఓజిలి మండలం నెమళ్ళపూడి గిరిజనులు



తిరుపతిలో..



ఏర్పేడు మండలం మోదుగులపాళెం వద్ద స్వర్ణముఖి నది లోలెవల్ కాజ్‌వేపై ప్రవహిస్తున్న వర్షపునీరు

పుత్తూరు వార్తలు

మరో రెండు రోజులు వర్షాలు

- కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్


నేసనూరు వద్ద వాగును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

పుత్తూరు అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావం మరో రెండు రోజులు ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో ఆయన పర్యటించారు. కాలువల నుంచి ఉప్పొంగుతున్న వర్షపు నీటిని ఎప్పటికప్పుడు దారి మళ్లించే దిశగా చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాలైన భవానీనగర్ వద్ద ఉప్పు కాలువ, నేసనూరు వద్ద వాగు పొంగి పొర్లుతున్నాయన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, బ్యారీకేడ్లు ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూమ్‌లో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ కార్తికేయ ఫోన్ నెం.9989024127, శానిటేషన్ సెక్రటరీ మునస్వామి నెం.9160509472 పర్యవేక్షణలో 14 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

పొంగిపొర్లుతున్న పాదిరేడు కాజ్‌వే



వడమాలపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వరవ కాలువల ద్వారా చెరువులకు నీరు చేరుతోంది. పాదిరేడుకు వెళ్లే రోడ్డులోని కాజ్ వే పొంగి పొర్లుతోంది. దీంతో పాదిరేడు, లక్ష్మమ్మ కండ్రిగ, టీసీ అగ్రహారం తదితర పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. గతంలో నిర్మించిన కాజ్ వే రోడ్డుకు దిగువన ఉండడంతో కొద్దిపాటి వర్షానికే రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. వెదళ్ల చెరువులోకి భారీగా నీరు చేరుతోంది. ప్రస్తుతం వరినారు పోశారు. వేరుశనగ విత్తలేదు.

పారుతున్న వాగులు

పుత్తూరు టౌన్: ఫెంగల్ తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పుత్తూరు పట్టణ సమీపంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భవానీనగర్ వద్ద ఉప్పు కాలువ ఉధృతంగా పారుతోంది. దీంతో తొరూరు, కొండల చెరువు, పైడిపల్లి తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

పుత్తూరు: మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం ఉదయం నుంచి నిలకడగా కురుస్తోంది. దీంతో జనజీవనం స్తంభించింది. అవసరమైతే తప్ప జనం ఇళ్ల నుంచి రాలేదు. పట్టణంలోని స్వర్ణ కాలనీలో ఓ పెద్ద చెట్టు విద్యుత్ తీగలపై పడడంతో పట్టణంలో సరఫరాకు అంతరాయం కలిగినట్టు ట్రాన్స్‌కో ఏడీఈ శంకరయ్య తెలిపారు. ఎక్స్‌కవేటర్‌తో చెట్టును తొలగించి రాత్రికి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. ఇక ఇప్పటివరకు నవంబరు సగటు వర్షపాతం 223 మి.మి కాగా 29వ తేదీ వరకు కేవలం 69.4 మి.మి మాత్రమే కురిసింది. దీంతో మండలంలోని 34 మధ్య, చిన్న నీటిపారుదల చెరువులు ఖాళీగా ఉన్నాయి. 30వ తేదీ ఉదయం 8.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు 103.4 మి.మి వర్షపాతం నమోదైంది. ఇదేవిధంగా రాత్రంతా వర్షం కురిస్తే మండలంలోని చెరువులన్నీ సగం వరకు నిండే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ ఏఈ రఘురామ్‌నాయక్ తెలిపారు. ఇప్పటికైతే గోవింద పాళెం చెరువు మాత్రమే నిండిందన్నారు. మండలంలో ఇప్పటివరకు వర్షం వల్ల ఎలాంటి నష్టం వాటిల్లలేదని రెవిన్యూ అధికారులు తెలిపారు.

జోరువానలోనూ పింఛన్ల పంపిణీ

- పుత్తూరు పరిధిలో 90 శాతం పూర్తి
- పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్

పుత్తూరు అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నా శనివారం ఎన్టీఆర్ భరోసా పంపిణీ చేశారు. శనివారం వేకువజామున 5.45 గంటలకే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు సచివాలయం సిబ్బంది చేరుకుని పంపిణీ చేశారు. పుత్తూరు పరిధిలో మొత్తం 5,756 మంది లబ్ధిదారులు ఉండగా రూ.2.46 కోట్లను పంపిణీ చేయాల్సి ఉండగా, 5,141 మందికి రూ.2.19 కోట్లు అందించారు. పంపిణీ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పర్యవేక్షించారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం


ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్


పుత్తూరు అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు రూ.4.80 లక్షలతో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. శనివారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు అందిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.ఎన్.ధనపాల్, మాజీ ఎంపీపీ అమ్ములు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆనంద్, సర్పంచ్ బొబ్బిలి యాదవ్, ఆస్పత్రి డాక్టర్ పల్లవి, తుడా ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పాల్గొన్నారు.

వాయిదా పడిన పంచాయతీ గదుల వేలం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రేణిగుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పంచాయతీ గదుల వేలం వాయిదా పడింది. ఆ మేరకు పంచాయతీ కార్యదర్శి మణి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'పంచాయతీ గదుల వేలం పాటలో సిండికేట్' అనే కథనం శనివారం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే వివిధ పార్టీల నాయకులు కూడా తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. దీంతో వేలాన్ని వాయిదా వేసిన పంచాయతీ కార్యదర్శి తరువాత ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

శాస్త్రోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరస్వామికి శనివారాన్ని పురస్కరించుకుని పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వర స్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠాపన చేశారు. మొదట గణపతి పూజ, కలశ పూజను చేశారు. అనంతరం శనీశ్వరస్వామికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళ జలం, కలశ జలాలతో అభిషేకించి విశేషంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.


నాయుడుపేటలో జలమయమైన రావువారివీధి



పెళ్లకూరు: జీలపాటూరులో నీటమునిగిన వరి - దొరవారిసత్రం: పూలతోట వద్ద సూళ్లూరుపేట - వాకాడు రహదారిని దాటుతున్న మాంబట్టు సెజ్ కార్మికులు

ఎడతెరపిలేని వర్షం

- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీటి మునిగిన పంటలు
- స్తంభించిన జనజీవనం

సూళ్లూరుపేట, నాయుడుపేట, నాయుడుపేట టౌన్, తడ, దొరవారి సత్రం, ఓజిలి, వాకాడు, పెళ్లకూరు, గూడూరు, చిల్లకూరు, బాలాయపల్లి, వెంకటగిరి టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. సూళ్లూరుపేటలో శనివారం ఉదయం నుంచే ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో అంబేడ్కర్ గురుకులం వద్ద రోడ్డుపై భారీగా వర్షపునీరు నిలవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. కోట పోలూరు రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో పుచ్చాకాలువ పొంగి రోడ్డు పైకి నీరు చేరడంతో రాక పోకలను నిలిపివేశారు. సూళ్లూరుపేట నుంచి కోటకు వెళ్లే బస్సులను మన్నె ముత్తేరి మీదుగా పంపించారు. సూళ్లూరుపేట పట్టణంలో జీఎన్‌టీ రోడ్డుపై వర్షపు నీరు నిలవడంతో మున్సిపాలిటీ అధికారులు ఎక్స్‌కవేటర్ సాయంతో మట్టిని తవ్వి నెర్రికాలువలోకి నీటిని పంపే ఏర్పాట్లు చేశారు. ఈదురు గాలులు వీయడంతో పలుచోట్ల చెట్లు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు అంత రాయం కలిగింది. అధికారులు వెంటనే మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు. సూళ్లూరుపేట - శ్రీకాళహస్తి మార్గంలో కొణ్ణంబట్టు వద్ద నిర్మాణంలో ఉన్న కల్వర్ట్ వద్ద డైవర్షన్ రోడ్డుపై నీరు చేరడంతో దాదాపు గంటకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. డైవర్షన్ రోడ్డుకు సమాంతరంగా నీరు చేరడంతో తెగిపోయే ప్రమాదం ఉండడంతో మంగళంపాడు, దామానెల్లూరు వైపు వాహనాలను పంపేందుకు తహసీల్దార్ నరసింహరావు చర్యలు చేపట్టారు. చెరువులు నిండుకుండల్లా మారాయి. పంటపొలాలు నీటమునిగాయి. ఇప్పటి వరకు ఎటువంటి ప్రమాదం జరగలేదని, ఎటువంటి విపత్తునైన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్డీవో కిరణ్మయి తెలిపారు. ● నాయుడుపేట పట్టణంలోని రహదారులు జలమయం అయ్యాయి. మండలంలో లోతట్టు ప్రాంతాలను తహసీల్దారు రాజేంద్ర పరిశీలించారు. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. చెరువులు, వాగులు, వంకల్లో వర్షపునీరు చేరుతోంది. ● తడలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు వర్షం విడవకుండా పడుతూనే ఉంది. చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారిపై తడ ఆదిత్యనగర్ వద్ద భారీగా వర్షపునీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు ఎక్స్‌కవేటర్ సాయంతో రహదారిపై ఉన్న డివైడర్‌ను కొంతమేర తొలగించి వర్షపునీరు కాలువల్లోకి మళ్లించి రాకపోకలను పునరుద్ధరించారు. కేవీబీపురం మండలం వద్ద ఉన్న కాళంగి రిజర్వాయర్ 8 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 4వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పాములకాలువ, కాళంగినది పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలైన కాదలూరు, వెండ్లూరుపాడు, మాంబట్టు, వాటంబేడు గ్రామాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ● దొరవారిసత్రం మండలంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 197 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. వరద నీటితో కాళంగి నది, నెర్రికాలువ, పాలకాలువ, కన్నా కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తనియాలి వద్ద కాళంగి వంతెనపై వరద నీటి ప్రవాహంతో ఏడు గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. పూలతోట సమీపంలో సూళ్లూరుపేట - వాకాడు ఆర్‌అండ్‌బీ రహదారిలో ఉన్న వంతెనపై కన్నకాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కట్టువపల్లి, సింగనాలత్తూరు, మేలనాలత్తూరు, కలగుర్తిపాడు, చిల్లమూరు, ఆరూరు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మాంబట్టు సెజ్‌లోని భారతి కంపెనీ కార్మికులు తాళ్ల సాయంతో రహదారిని దాటారు. అలాగే కుప్పారెడ్డి పాళెం సమీపంలో వెదురుపట్టు రోడ్డు ఉన్న వంతెనపై పాలుకాలువ వరద ప్రవహిస్తుండడంతో మూడు గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. అక్కడక్కడ చెట్లు కూలడం, వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా ఆపేశారు. ● కోట మండలంలో మోస్తారు కురిసింది. స్వర్ణముఖినది పరివాహక గ్రామాలైన గూడలి, దక్షిణపాలం, తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగ, తాటితోపు, రంగన్నగుంట, వెంకన్నపాళెం తదితర గ్రామాల్లో వరి నారుమడులు, వరినాట్లు నీట మునిగిపోయాయి. సిద్దవరం, గోవిందపల్లి గ్రామాల మీదుగా బంగాళాఖాతంలో కలిసే బకింగ్‌హామ్ కెనాల్‌కు వరద పోటెత్తడంతో కెనాల్ నిండుకుండలా మారింది. శ్రీనివాససత్రం, గోవిందపల్లిపాళెం గ్రామాల సమీపంలో ఉన్న సముద్రంలో భారీ ఎత్తున అలలు ఎగిసిపడ్డాయి. గూడలి వద్ద స్వర్ణముఖినదిలోని మామిడి కాలువలోకి ఎగువప్రాంతాల నుంచి వరదనీరు పోటెత్తింది. కాలువ దిగువ భాగమైన చల్లకాలువనది మీదుగా పెన్నక్కచెరువులోకి వరదనీరు ప్రవహిస్తోంది. ● ఓజిలి మండలంలో శనివారం రోజంతా వర్షం పడుతూనే ఉంది. మండలంలోని మానమాల - కొండవల్లిపాడు, నెమళ్ళపూడి - పున్నేపల్లి, కురుగొండ - చిట్టమూరు మండలం గునుపాడు మార్గంలో వాగులు, మామిడి కాలువ ప్రవాహం కారణంగా ఆయా మార్గాలను రాకపోకలను ఆపేశారు. నెమళ్ళపూడి గ్రామానికి ముంపు ప్రమాదం పొంచి ఉండడంతో 8 గిరిజనుల కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించినట్లు తహసీల్దారు పద్మావతి తెలిపారు. ● వాకాడు మండలంలో కురిసిన భారీ వర్షాలకు తూపిలిపాళెం లోతట్టు ప్రాంతమైన ఎస్టీ కాలనీ ఇళ్లలోకి నీరు చేరడంతో ముంపు బాధితులను ఎంపీయూపీ పాఠశాలలోకి తరలించారు. వాకాడు స్వర్ణముఖిబ్యారేజీ, కల్లూరు చెరువుకట్ట తూములను సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఇరిగేషన్ ఏఈలు శ్రీనివాసరావు, కృష్ణయ్య తదితరులు ఉన్నారు. స్వర్ణముఖి నదిలో ఇప్పటికే 0.035 టీఎంసీల నీరు ఉండటంతో వరదనీటిని దిగువకు వదులుతున్నట్లు ఇరిగేషన్ ఏఈ కృష్ణయ్య తెలిపారు. 1800 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండటంతో 4గేట్‌లను ఎత్తి సముద్రంలోకి నీటిని వదులుతున్నామన్నారు. ● పెళ్లకూరు మండలంలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. వరి నాట్లు వేసిన పంట పొలాలు నీటమునిగాయి. కలవకూరు, కప్పగుంటకండ్రిగ గ్రామాల వద్ద ఉన్న కాజ్‌వేలను తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి పరిశీలించారు. పెనలగుర్రప్పతోట వద్ద జాతీయ రహదారి నుంచి కప్పగుంటకండ్రిగ మీదుగా వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ● గూడూరు పట్టణంలో శనివారం వేకువజాము నుంచి ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. వర్షానికి తోడు చలిగాలులు వీస్తుండడంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులుపడ్డారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు ప్రవహిస్తుండడంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ● చిల్లకూరు మండలంలో శనివారం ఉదయం నుంచి మోస్తరు వర్షం కురిసింది. వరగలి క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డుపై వర్షపునీరు చేరడంతో వాహదారులు అవస్థలు పడ్డారు. అదేవిధంగా పారిచెర్లవారిపాళెం సమీపంలోని రోడ్డుపై గుంతలు ఏర్పడి వర్షపునీరు చేరడంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ● బాలాయపల్లి మండలంలో ఉదయం నుంచి మోస్తరు కురిసింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శ్రీనివాసులు సూచించారు. ● వెంకటగిరిలో మోస్తరు వర్షం కురిసింది. పట్టణంలోని స్థానిక అన్న క్యాంటీన్, మున్సిపాలిటీ కార్యాలయం దారిలో, రైల్వేస్టేషన్ రోడ్డులో వర్షపు నీరు చేరింది. వెలుగొండ అడవుల్లో నుంచి వర్షపు నీరు కౌవల్యానదికి చేరుతోంది. తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో కోటేశ్వరరావు సూచించారు.


వాకాడు స్వర్ణముఖి బ్యారేజీ వద్ద అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా




కోట: గూడలి స్వర్ణముఖి వద్ద పరవళ్లు తొక్కుతున్న మామిడికాలువ - సూళ్లూరుపేట: పుచ్చాకాలువ పొంగి కోటపోలూరు రోడ్డులో పారుతున్న నీరు - గూడూరు: ఆర్టీసీ బస్టాండు సమీపంలో జలమయమైన రోడ్డు

వర్షంలోనూ పింఛన్ల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం ఎడతెరిపి లేని వర్షం కురుస్తున్నా సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. వానలోనూ పంపిణీ చేయాల్సిందిగా ఎంపీడీవో త్రివిక్రమరావు ఆదేశాలు జారీ చేయడంతో 90శాతం జరిగింది.

రేణిగుంట: మండలంలో శనివారం ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీ 94 శాతం జరిగింది. తూకివాకం పంచాయతీకి చెందిన ఓ లబ్ధిదారు అనారోగ్యంతో స్విమ్స్‌లో చికిత్స పొందుతుంటే అక్కడికి వెళ్లి ఫించను అందించారు.

సత్యవేడు: హోరు గాలులు ఒక వైపు, తుఫాన్ ప్రభావంతో ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షం మరో వైపు. అయినా అధికారులు మాత్రం వెరవకుండా పింఛన్‌ల పంపిణీ చేపట్టారు. సత్యవేడు మండలంలో 83 శాతం పింఛన్ పంపిణీ జరిగినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో మొత్తం 7264 పింఛన్లు ఉండగా 6028 మందికి పంపిణీ చేశామన్నారు. మిగిలిన పింఛన్‌ల పంపిణీని సోమ, మంగళవారాల్లో పూర్తి చేస్తామని ఆయనతెలిపారు.

సీఆర్‌ఎస్‌లో జోరందుకున్న ఎన్నికల ప్రచారం


సీఆర్‌ఎస్ వర్క్‌షాప్‌లో మజ్దూర్ యూనియన్ నాయకుల ప్రచారం

రేణిగుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో ఉన్న సీఆర్‌ఎస్‌లో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. దేశవ్యాప్తంగా రైల్వే యూనియన్ ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా మజ్దూర్ యూనియన్ చైర్మన్ సదాశివరెడ్డి, కార్యదర్శి బాబు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆఖరి రోజున దక్షిణ రైల్వే మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఉదయభాస్కర్, వర్క్‌షాప్ డివిజన్ సెక్రటరీ బుచ్చిరెడ్డి ప్రచారం నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గూడూరు, సూళ్లూరుపేట, తడ, చిల్లకూరు, చిట్టమూరు, దొరవారి సత్రం, ఓజిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన గూడూరు పట్టణంలోని రెండో వార్డులో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివారం సెలవు దినం కావడంతో ఒక్కరోజు ముందుగానే లబ్దిదారులకు పింఛను అందజేస్తున్నా మన్నారు. డిసెంబరు 2వ తేదీ నుంచి పింఛన్లు, రేషన్‌కార్డుల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సీఐ శేఖర్‌బాబు, నాయకులు అబ్దుల్‌రహీం, బిల్లు చెంచు రామయ్య, జహంగీర్, అల్లీహుస్సేన్, ఇశ్రాయిల్‌కుమార్ పాల్గొన్నారు. ● సూళ్లూరుపేట మన్నారుపోలూరులో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మున్సిపల్ కమిషన్ చిన్నయ్య పింఛన్లు పంపిణీ చేశారు. ● తడ మండ లంలో 98శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో విజయ కుమార్ తెలిపారు. ● చిల్లకూరు మండలంలో తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యదర్శి చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, సచివాయ సిబ్బందితో కలిసి పింఛన్లు అందజేశారు. ● చిట్టమూరు మండలంలో 90శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపీడీవో మనోహర్‌గౌడ్ తెలిపారు. ● దొరవారి సత్రం మండలంలో 91.07 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు అధికా రులు తెలిపారు. ● ఓజిలిలోని ఎస్ఎస్ఆర్ గిరిజన కాలనీలో డీఎల్‌డీవో జాలిరెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

సభ్యత్వ నమోదు వేగవంతం



శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో మరింత చురుగ్గా వ్యవహరించాలని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. శనివారం పార్టీ కార్యాలయం వద్ద గతంలో భవిష్యత్తుకు గ్యారెంటీ, ప్రస్తుతం టీడీపీ సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొని అధిక సంఖ్యలో నమోదు చేయించిన బాలాజీ, సునీల్, ఖాదర్‌ను అభినందించారు. వారికి కానుకగా మొబైల్ ఫోన్లను అందించారు.

11న ఏడుగంగమ్మల జాతర

శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏడుగంగమ్మల జాతర వేడుకలను ఈనెల 11న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. ముక్కంటి ఆలయం వద్ద శనివారం జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణంలో ఏడుచోట్ల గంగమ్మలు కొలువుదీరి ఒకేసారి జాతర జరుపుకోవడం ఎంతో విశేషమన్నారు. ఈ ఏడాది వైభవోపేతంగా జాతరను నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను చేస్తున్నారన్నారు. ఈవో బాపిరెడ్డి, టీడీపీ నాయకులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ నరసింహవర్మ

శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్వీ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది ప్రజ్ఞశ్రీ... సోషల్ మీడియా వినియోగం, సైబర్ బుల్లీయింగ్‌పై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో అసభ్య, అసత్య, అశ్లీల పోస్టులు పెడితే చట్టప్రకారం శిక్షార్హులన్నారు. ప్రిన్సిపాల్ నరసింహవర్మ మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే మరో కార్యక్రమంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. చర్చా వేదిక, రంగోలి పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు

గూడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణ పనులను త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా పాల్గొన్నారు.

దళిత ఉద్యమకారుడు ఆర్వీ కన్నుమూత


రమణయ్య(ఫైల్‌ఫొటో)

కోట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దళిత బహుజన ఉద్యమకారుడు ఆర్వీ రమణయ్య కన్నుమూశారు. ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోసిన రమణయ్య అలియాస్ రాయపు వెంకట రమణయ్య(65) కోట పట్టణంలోని ఎన్‌సీఆర్ నగర్‌లో ఉన్న ఆయన నివాసంలో శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్త పాళెం పంచాయతీ విశ్వనాథపుర అగ్రహారానికి చెందిన రమణయ్య ఉపాధ్యాయ వృత్తిలోనే కొనసాగుతూనే ఎన్నో దళిత, బహుజన ఉద్యమాలకు బాటలు వేశారు. ఉద్యోగ విరమణ తరువాత ఎన్నో భూ పోరాటాలు సాగించారు. భూస్వాములకు వ్యతిరేకంగా చేసి సముద్రతీర ప్రాంత మండలాలలో అంబేద్కర్‌ను పరిచయం చేసిన ఘనత ఆర్వీ రమణయ్యకు దక్కింది. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతదేహానికి పలు పార్టీల నేతలతో పాటు ప్రజాసంఘాలు, కులసంఘాల ప్రతినిధుల నివాళులర్పించారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిల్ రెడ్డి, పక్కన ఎంపీడీవో

సూళ్లూరుపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా నిర్వహిస్తున్న సర్వేలో అధికారులు అర్హులను గుర్తించి గృహాలు మంజూరు చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరించేలా చొరవ తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలా రాణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్, ఏపీవో నాగరాజు, గృహనిర్మాణ శాఖ ఏఈ సత్యనారాయణ, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పుట్టాలమ్మ ఆలయంలో హుండీ చోరీ



వాకాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిగుంటపాళెం గ్రామదేవత పుట్టాలమ్మ ఆలయంలో హుండీ చోరీ జరిగింది. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం తాళాలు పగలగొట్టి హుండీలో ఉన్న సుమారు లక్ష రూపాయల నగదు ఎత్తుకెళ్లారు. శనివారం ఆలయ ధర్మకర్త దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వర్షం... స్తంభించిన జనజీవనం



రౌతు సూరమాల వద్ద నీట మునిగిన వరి



వితయపాళెం సమీపంలో వర్షానికి కోతకు గురైన కారిపాకం ప్రధాన రహదారి



వరదయ్యపాళెం మారేడు కాలువ వద్ద పోలీసు పహారా





ఉధృతంగా ప్రవహిస్తున్న గుడిమల్లం సీతకాల్వ - మోదుగులపాళెం - కొత్తవీరాపురం మధ్య స్వర్ణముఖి నది కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు









కారాకొల్లు వద్ద పొంగిన కాలువ - రాజీవ్‌నగర్ చీలుడు కోన - వీఆర్ కండ్రిగ వద్ద రోడ్డుపై వాలిన చెట్లను తొలగిస్తున్న పోలీసులు - పూడి మట్టి వంతెన కొట్టుకుపోవడంతో కాపలా ఉన్న రెవెన్యూ సిబ్బంది

శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి పట్టణంలో వీధి వ్యాపారులు, చిరువ్యాపారులు విక్రయాలు మందగించాయి. మండలంలోని ఊరందూరు కాలువ పొంగడంతో ముండ్లపూడి ఎస్టీకాలనీకి రాకపోకలు స్తంభించాయి. ఇక స్వర్ణముఖి నది శనివారం నిండుకుండలా ప్రవహించింది. ముచ్చివోలు, ఓబులాయపల్లి, గంగలపూడి వద్ద కాలువలు పొంగాయి. తొట్టంబేడు మండలం చిట్టత్తూరు, కారాకొల్లు వద్ద వాగులు పొంగడంతో రాకపోకలు స్తంభించాయి. శ్రీకాళహస్తి మండలం, ఏర్పేడు, కేవీబీపురం పరిధిలో 36 విద్యుత్ స్తంభాలు, 12 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. మొత్తం శ్రీకాళహస్తి రూరల్ డివిజన్ పరిధిలో సుమారు రూ.10లక్షలు ఆస్తినష్టం వాటిల్లినట్లు ఏడీఈ సుధాకర్ తెలిపారు. ఇక శ్రీకాళహస్తి పట్టణంలో ఎలాంటి అంతరాయం ఏర్పడలేదు. తొట్టంబేడు మండ లంలో పది విద్యుత్ స్తంభాలు, బుచ్చినాయుడుకండ్రిగలో 20 విద్యుత్ స్తంభాలు, నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. మొత్తం రూ.4లక్షలు ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

రేణిగుంట: మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. గాజులమండ్యం, కల్లూరు గ్రామాల మధ్య వాగు ప్రవాహం ఉధృతంగా ఉం డడంతో ఈ మార్గాన్ని అధికారులు మూసివేశారు.

కేవీబీపురం: మండలంలోని రాజులకండ్రిగ వద్ద కాళంగి యేరుకు వేసిన మట్టి వంతెన శనివారం కొట్టుకుపోయింది. దీంతో ఐదు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పూడి, ఎగువపూడి, దిగువ పూడి, పూడి సీకే పురం, పోలినాయుడు కండ్రిగల ప్రజలే యేరు దాటకుండా రెవెన్యూ సిబ్బందితో ఇరువైపులా కాపాల ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు మునిరత్నం చెప్పారు. తుఫాన్‌ను దృష్టిలో పెట్టుకుని ముందుగానే ఆయా గ్రామాలకు వైద్యబృందాలను తరలించినట్లు తెలిపారు. కాగా తుఫాన్ కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

బుచ్చినాయుడుకండ్రిగ: వర్షాలకు వాగులు, వంకలు పారుతూ చెరువుల్లోకి నీరు చేరుతున్నాయి. జంబుగోళం, పూసలపల్లి, చిన్నాయ్యగుంట, నెరిణికండ్రిగ, కాంపాళెం, నీర్పాకోట, కుక్కంబాకం, ఆర్.అనంతపురం గ్రామాల్లో వరి నీటమునిగింది. పల్లమాల, చిన్నపాలేడు, జంబుగోళం, కాంపాళెం, కుక్కంబాకం చెరువులు కలుజులు పారుతున్నాయి. కనమనంబేడు చెరువుపై ఉన్న ఓ పెద్ద వృక్షం వర్షానికి కూలింది. జంబుగోళం దగ్గర ఉన్న మల్లి కాలువ ఉధృతంగా పారడంతో వరి నీట మునిగింది. చెరువులకు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఏర్పేడు: మండలంలో వాగులు, వంకలు కదిలాయి. మోదుగులపాళెం కొత్త వీరాపురం గ్రామాల మధ్య స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. లో లెవల్ కాజ్‌వేపై నీరు ప్రవహిస్తుండడంతో ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయా యి. అదే విధంగా గుడిమల్లం గ్రామానికి వెళ్లే మార్గంలో సీతకాల్వ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఈ గ్రామానికి కూడా రాకపోకలు స్తంభించాయి. ఈ క్రమంలో గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయ అధికారులు ఉధృతం తగ్గే వరకు భక్తులు ఆలయానికి రావద్దని ప్రకటన విడుదల చేశారు. అలాగే సీతారామపేటలో శనివారం కురిసిన వర్షానికి ఓ ఇల్లు కూలింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

నారాయణవనం: మండలంలోని పలు కాజ్‌వేలపై నీరు పారుతోంది. తిరువట్యం, సముదాయం, తుంబూరు, పాలమంగళం కాజ్‌వేలపై నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. దీంతో పోలీసులు రాకపోకలను అనుమతించడం లేదు. నారాయణవనం ఎస్ఐ రాజశేఖర్ తిరువట్యం కాజ్‌వేను పరిశీలించారు.

వరదయ్యపాళెం: జోరు వానతో మండలంలోని గోవర్ధపురం, సీఎల్ఎనల్‌పల్లి, పాండూరు, కడూరు కాజ్‌వేలపై నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గోవర్ధనపురం వంతెనపై ఆర్టీసీ బస్సు ఆగిపోవడంతో అందులోని 40మంది ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు వారిని సురక్షితంగా రోడ్డు దాటించారు. వితయపాళెం సమీపంలో కారిపాకం ప్రధాన రహదారి కోతకు గురైంది. అదే విధంగా సీఎల్ఎస్‌పల్లి సమీపంలో పాముల కాలువ ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు ఆగిపోయాయి. దీంతో బుచ్చినాయుడుకండ్రిగ మీదుగా గమ్యస్థానాలకు చేరుకున్నారు. మారేడు కాలువ వంతెనపై నీరు ప్రవహించడంతో పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. అంబికాపురం వద్ద గొడ్డేరు ఉధృతంగా ప్రవహి స్తుండడంతో నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా పెద్దపాండూరు అరుణానది వంతెనపై నీరు ప్రవహిస్తోంది. దీంతో అధికారులు రాకపోకలు ఆపేశారు.

సత్యవేడు: వర్షానికి చలిగాలులు తోడు కావడంతో చలి తీవ్రత పెరిగి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. సత్యవేడు - ఊత్తుకోట మార్గంలో వీఆర్ కండ్రిగ వద్ద ఓ వృక్షం నేలకొరిగింది. ఎస్ఐ రామస్వామి, సిబ్బంది చెట్లను తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు. కాగా సత్యవేడు- నాగలాపురం మండలం సరిహద్దు టీపీకోట వద్ద ఉన్న గొడ్డేరు వాగు (రాళ్ళవాగు)కు ఆకస్మికంగా వరద పోటెత్తింది. ఆ మార్గంలో వెళ్ళే వాహనదారులు ప్రవాహాన్ని గమనించి వాగులోకి వెళ్లకుండా ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వాగుకు ఎగువన ఉన్న భూపతీశ్వర ప్రాజెక్టు నుంచి నీరు ఒక్కసారిగా పోటెత్తింది. కాగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఆదిమూలం సూచించారు. ఏడు మండలాల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తుఫాన్ ప్రభావంపై వివరాలడిగి తెలుసుకున్నారు.







నెరిణికండ్రిగ, కుక్కంబాకంలో నీటమునిగిన వరి - అయ్యవారిపాళెంలో నీట మునిగిన వరి - కాళంగి రిజర్వాయర్ వద్ద అధికారులు

శాస్త్రోక్తంగా లక్ష బిల్వ, కుంకుమార్చన నిమజ్జనం



బిల్వాలకు, కుంకుమకు పూజలు

శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో శనివారం లక్ష బిల్వ, కుంకుమార్చన నిమజ్జనం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలోని అలంకార మండపంలో పదిరోజుల పాటు నిర్వహించిన ఈ పూజలు శనివారంతో ముగిశాయి. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ బిల్వ పత్రాలను, కుంకుమను ఊరేగింపుగా స్వర్ణముఖి నది వద్దకు తీసుకువచ్చారు. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కరుణాకరన్ గురుకుల్, అధికారులు లోకేష్‌రెడ్డి, నాగభూషణం యాదవ్ తితరులు పాల్గొన్నారు.





బిల్వాలు, కుంకుమ నిమజ్జనం

వైభవంగా అష్టోత్తర కలశ పూజలు



పూజల్లో పాల్గొన్న ఈవో బాపిరెడ్డి దంపతులు

శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం అష్టోత్తర కలశ పూజలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఈ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. ఆలయ ఈవో బాపిరెడ్డి దంపతులు, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, ఏఈవో లోకేష్‌రెడ్డి, ఆలయ అధికారులు తదితరులుపాల్గొన్నారు.

ముగిసిన ఆకాశదీపం వేడుక



శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఆకాశదీప వేడుకలు ముగిశాయి. ముక్కంటి ఆలయంలో కార్తీక మాసంలో ప్రతి రోజు ఆకాశదీపాన్ని వెలిగించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయ వేదపండితులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. శనివారంతో ఆకాశదీపం వేడుక ముగిసింది. ఈవో బాపిరెడ్డి సతీమణి సుధ, ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

అరణియార్ గేట్లను పరిశీలించిన ఎస్పీ



అరణియార్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

పిచ్చాటూరు. నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టు గేట్లను ఎస్పీ సుబ్బారాయుడు శనివారం సాయంత్రం పరిశీలించారు. అరణియార్ ప్రాజెక్టు నీటిమట్టం 25 అడుగులకు చేరుకున్న నేపథ్యంలో గేట్ల వివరాలను, కట్టపరిస్థితిని జలవనరుల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అరణియార్ ఇన్‌ఫ్లో 3500 క్యూసెక్కులుగా ఉందని, ప్రాజెక్టు నీటిమట్టం 27 అడుగులకు చేరిన వెంటనే గేట్లను పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేస్తామని ఏఈ లేకేశ్వర్ రెడ్డి చెప్పారు. గేట్లను పైకెత్తే ముందు అరుణా నది పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాలతో పాటు, తమిళనాడులోని జిల్లా కలెక్టర్లు, ఇరిగేషన్ శాఖ అధికారులకు ముందస్తు సమాచారం అందిస్తామన్నారు. డీఎస్పీ రవికుమార్, సీఐ రవీంద్ర, ఎస్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల మృతికి ఎమ్మెల్యే ఆదిమూలం నివాళి

సత్యవేడు / పిచ్చాటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, టీడీపీ నేత పామాంజి మురళి తల్లి పామాంజి హంసమ్మ (70) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం సత్యవేడుకు చేరుకుని హంసమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. పిచ్చాటూరు మండలం ఇందిరా నగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త మురుగన్ (55) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఎమ్మెల్యే ఆదిమూలం గ్రామానికి చేరుకుని మురుగన్ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్ రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కూటమి ధ్యేయం



పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. పట్టణంలోని రాజీవ్‌నగర్ వద్ద శనివారం ఉదయం ఎమ్మెల్యే పింఛన్లను పంపిణీ చేశారు. 1వ తేదీన ఆదివారం కావడంతో లబ్ధిదారులకు ఒకరోజు కూడా ఆలస్యం కాకుడదన్న ఆశయంతో ముందుగానే పింఛన్లను పంపిణీ చేశామన్నారు. తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ జోరు వానలో కూడా పింఛన్ల పంపిణీ ఎంతో ఉత్సాహంగా జరిగిందన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాను బాధితులకు అండగా ఉంటాం

శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ తీవ్రతతో భారీ వర్షం కురుస్తోందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సుధీర్ తెలిపారు. బాధితులకు అండగా ఉంటామన్నారు. ఇప్పటికే అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. రెండు మూడురోజుల పాటు తుఫాన్ ప్రభావం ఉంటుందని ప్రజలు తగు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కూటమి నాయకులు కూడా వర్ష బాధితులకు సహాయ సహకారాలు అందించాలన్నారు.

నేడు గౌడ కుల కార్తీక వన మహోత్సవం

శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గ గౌడ కులస్థులకు ఆదివారం వన మహోత్సవం నిర్వహించనున్నట్లు శ్రీకాళహస్తి గౌడ సంఘం అధ్యక్షుడు ఏ.రమేష్‌బాబు గౌడ్ తెలిపారు. తొండవాడలోని ముక్కోటి సమీపంలో నారాయణ గార్డెన్స్‌లో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.